జ్యోతి కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# తిరిగొచ్చిన గేదె

తల్లావఝుల సుందరం

## 1

పురాణాలు చదివేరా?? లేదా!! పోనీ ఇతిహాసాలు?? అది లేదా!!—వదిలేయండి. పోనీ వాటిల్ని క్యాష్ చేసుకొన్న సినిమాలు చూసేరా!! చూసే వుంటారు. వాటివల్ల మనం నేర్చుకున్నది ఏమున్నదో అనవసరం కానీ సీతా, సావిత్రి, సుమతి అంటూ పతివ్రతలు, మహా సాధ్వీమణుల లిస్టు వరసగా చదివేయగలం పొరపాటున యెవరేనా అడిగితే! వాళ్ళ భక్తి వాళ్ళను ఎల్లవేళలా కాపాడుచుండును. వాళ్ళను ముట్టుకుంటే మాడిపోగలం. (కావలిస్తే పురాణ సినిమాలు చూడుడు) వాళ్ళు పిలిస్తే దాసిజనం గబుక్కున వచ్చేవారో లేదో గాని నమ్ముకొన్న దేవుడు మాత్రం సాక్షాత్కరించేవాడు. అందులో ధోకా లేదని సదరు పుస్తకాలవల్ల, పందిళ్ళలో హరికథలవల్ల తెలుస్తోంది.

ఎందరో సాధ్వీమణులు, పతివ్రతలు యీ గడ్డమీద పుట్టడంవల్లే స్త్రీజాతి వాళ్ళ పేర్లు తల్చుకొని యీ మాత్రం భయభక్తులతో వుంటున్నారని పెద్దల అభిప్రాయం. అలాంటి సదభిప్రాయమే కావమ్మగారికి కూడా వుంది. ఆవిడకు వుండడంలో తప్పులేదు. కారణం ఈ శతాబ్దంలో ఆ కోవకు చెందిన మహా భక్తురాలు. ఆవిడ భక్తిగురించి, ఆవకాయ గురించి తెలీనివారు బహు అరుదు. ఆవిడ పుట్టుకకు ముందు వాళ్ళ అమ్మగారికి దేవుడు కలలో కన్పించి నీకు పుట్టబోయే బిడ్డ పరమ భక్తురాలౌతుందని చెప్పి మాయం అయ్యేడుట!

రామాయణంలో సీతమ్మవారికి కల్గిన కష్టాలా కావమ్మగారు కూడా చాలా బాధలు పడ్డది. పెళ్ళయిన కొత్తల్లో కొంతకాలం భర్త ఎడబాటు—ఆ తర్వాత ఆయన నమ్ముకొన్న పెళ్ళాన్ని వదుకొన్న సులక్షమంచాన్ని వదిలేయక తప్పింది కాదు.

"భగవంతుడు చిన్నచూపు చూసేడు—" అని అనుకొన్నారు కావమ్మగారు వంశ పారంపర్యంగా వస్తున్న వైధవ్యాన్ని తల్చుకొని. ఆ రోజునుంచి ఆమె ఏకాకి. ఉన్న ఒక్కగానొక్క కూతురు కుమార్తును కని, పట్నంనుంచి వచ్చిన ఓ హెల్త్ విజిటర్ కుర్రాడ్ని • మోహించి ఓ అర్ధరాత్రి హాయిగా లేచిపోయింది. వున్న ఊళ్లో తలెత్తుకోలేక మనవడ్ని తోడు తీసుకొని ఆ ఊరు ఈ వూరు తిరిగి ఆఖరికి విప్రుల్లపల్లిలో స్థిర నివాసం ఏర్పరుచుకొన్నారు.

అప్పటికే చుట్టుపక్కల గ్రామాల్లో కావమ్మగారి భక్తి గురించి, కూతురు లేచి పోవడానికి గల వైనాలు అందరికీ చూచాయగా తెల్సు. దాంతో ఆ గ్రామంలో కాలు పెట్టగానే సాక్షాత్తు మానవ రూపంలో వున్న దేవతే తమ గ్రామం వచ్చిందని సంబరపడి ఓ చిన్న యిల్లు సంవత్సరానికి సరిపడ్డా గింజలు యేర్పాటు చేసేరు.

సోమశేఖరశర్మ గారింట్లో వాళ్ళ మనమరాలు అన్నప్రాసన రోజున స్టీలు చెంచా పోయింది—కరణం గారికి కాపు వీధిలోవున్న రెండో ముండ నగలతో సహా మాయం అయింది—కొత్తగా వచ్చిన మేష్టారిగారి అమ్మాయి సిగ్గుబిళ్ళ పోయింది. కానీ అవన్నీ మళ్ళా యెలా దొరికేయి అన్న అనుమానం వస్తే సమాధానం కావమ్మగారు. లేచిపోయిన పెళ్ళాం దగ్గరనుంచి—గట్టు దాటిన గేదెల వరకు అవి యెలా పోయింది? యెలా దొరికేది?? క్షణంలో చెప్పగల్దు. ప్రతిఫలంగా అరిటిపండు కూడా ఆశించదు. దాంతో ఆమె పేరు ప్రఖ్యాతులు చుట్టుపక్కల గ్రామాల్లో కూడా వ్యాపించేయి.



ఆవిడ మనవడ్ని అందరూ 'గుండు వెంకు' అని ముద్దుగా పిలుస్తారు. వాళ్ళింటి పేరు గుండు కాదు. అలా అందరూ పిల్చినప్పుడల్లా బామ్మమీద చచ్చేంత కోపం పుట్టెడు దుఃఖం వస్తుంది వెంకుకి. అతని గుండు నిత్యనూతనంగా యెప్పుడూ తళతళలాడే కొత్తరూపాయి బిళ్ళలా మెరుస్తుంటుంది. ఎడారిలో పూలమొక్కలు మొలవొచ్చు—బట్టనెత్తిమీద వెంట్రుకలు మొలవొచ్చు—మాచకమ్మ పెద్దమనిషి కావచ్చు. కానీ అతని గుండుమీద జుట్టు మాత్రం రాదు. శాస్త్రరీత్యా వస్తుంది కానీ మొలక దశలోనే కావమ్మగారు "ఫలానావారి చెంచా దొరికితే స్వామీ! నీకు నా మనవడి నీలాలు సమర్పించుకొంటాను—" అని లంపం ఎరమావడం—పోయిన వస్తువు దొరకడం—మంగలి అప్పన్నకి పచ్చడి పెట్టి, వెంకుకి నున్నగా గుండు గీయించటం టకటకా జరిగిపోతాయి.

అసలు వెంకుకి జుట్టు రావడం మంగలి అప్పన్నకి కూడా యిష్టంలేదు. "ఎంత సెడ్డా బేపనోల్ల పచ్చడి సేనా బాగుంటుంది—" అని అందరితో అంటాడు. మరి పచ్చడి కావాలంటే అనునిత్యం కావమ్మగారు మొక్క-

## రచయిత గురించి



తల్లావఝుల సుందరం పుట్టింది పెరిగింది ఒంగోలులో. ప్రస్తుత నివాసం, ఉద్యోగం హైద్రాబాదులో. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ లిమిటెడ్‌లో జూనియర్ అసిస్టెంటు. అడపదడపా రాసిన కథలన్నీ అన్ని ప్రముఖ పత్రికల్లోనూ ప్రచురితమైనాయి. మొదటిసారి మొదటి బహుమతి 'ఉదయాగమం' 77' జ్యోతి దీపావళి నవలల పోటీలో లభించింది. బీనాదేవి గారి రచనలంటే చాలా ఇష్టం—అలాగే నాటకాలువెయ్యడం అన్నా-స్నేహితులతో కాలక్షేపం అన్నా మరింత ఇష్టం.

తూనే వుండాలి. వీళ్ళిద్దర్నీ తల్చుకొన్నప్పుడల్లా వొళ్ళు మండి, చేతిలో కత్తి వుంటే ఒకే పోటుతో యిద్దర్నీ పొడిచేద్దామన్న చిన్న కోరిక వెంకుకి లేకపోలేదు.

స్కూల్లో అందరూ సరదాగా అతని గుండు మీద మొట్టికాయలు మొట్టి పారిపోతుంటారు. ఆఖరికి వొంటిజడ చీమిడిముక్కుల పార్వతి కూడా వెక్కిరిస్తుంది.

వెంకుకి మొట్టమొదటిసారి టూరింగ్ టాకీసులో చూసిన పాతాళభైరవి సినిమా అంటే చెడ్డ యిష్టం. సినిమా కథ అంతగా గుర్తులేకపోయినా ఎన్టీవోడి జుట్టు భుజాలదాకా వుంగరాలు తిరిగి వుండడం అతని చిన్నారి మనసు మీద ముద్ర వేసేయ్. ఆ తర్వాత పలుమార్లు కలల్లో ఎన్టీవోడు వుంగరాల జుట్టు దువ్వుకొంటూ కన్పించేడు.దాన్తో పిచ్చెక్కిపోయింది.

పట్నంలో చదువుకొంటున్న కరణంగారి మూడో అబ్బాయికి వుంగరాల జుట్టే! తన తోటి సదాశివంకి వుంగరాల జుట్టే!! మరి తనకో?!! ఛీ...ఛీ ..ఈ బామ్మ ముండ చచ్చినా బాగుండును!—అని పదే పదే ప్రతిరోజూ అనుకోకుండా వుండలేకపోయేడు వెంకు. యెప్పుడూ యెవరో ఒకరు రావడం యేదో పోయిందనడం తన్ని అడక్కుండానే తన జుట్టు అర్పించుకొంటానని బామ్మ మొక్కుకోవడం గొప్పగా చిరాకనిపించింది. చాలా సార్లు బ్రతిమలాడేడు. కానీ ఆవిడ "బొచ్చు కన్నా భక్తి యెక్కువరా వెధవా! ఆ స్వామి దయలేకపోతే మనం యిలా వుండగలమా?! తప్పు నాయనా అలా అనకూడదు. తప్పు క్షమించమని దేవుడికి—" అని ఆవిడ మాట పూర్తిచెయ్యకముందే "బామ్మా! మళ్ళీ దేవుడికి మొక్కుకోకే వచ్చిన కొంచెం జుట్టు తీయించకే—" అని కాళ్ళమీద పడ్డాడు.

ఆవిడ "అపచారం...అపచారం..."అంటూ చెంబుడు నీళ్ళు నెత్తిమీద దిమ్మరించుకొని దేవుణ్ని రిక్వెస్టు చేసింది. "చిన్న కుంక తెలీక వాగేడు వాదిలేయ్ స్వామి!!" అని. అప్పటికి ఆ గండం గడిచింది. ప్రాణం కుదుటపడింది. తెల్లగా మెరిసే గుండుమీద నల్లగా మిల మిల లాడే జుట్టును చూసుకొన్నప్పుడు అతని ఆనందానికి అవధి వుండేది కాదు.

దిన దిన ప్రవర్ధమానమౌతున్న వెంట్రుకల్ని, నిజమౌతున్న కలల్ని తల్చుకొని





మనసు ఆనందంతో పురకలు వేసింది—వెంకుకి.

కానీ అతగాణ్ని 'గుండు వెంకు' అని పిలవడం మానకపోవడంతో దారుణంగా కోపం వచ్చింది కానీ అతని సంతోషం కోపాన్ని మింగేసింది.

### 2

ఆ ఉదయం ముప్పైరెండోసారి తల దువ్వుకొంటూ నవ్వుకొన్నాడు. విరిగిన అద్దం ముక్కతో వెంకు నవ్వు తెగిపోయింది. నల్లని ఆముదం పట్టించిన జుట్టు ధగ ధగ మెరుస్తూ గాలికి కదిలే వరి మొలకల్లా మెత్తగా కదులుతుంటే వెంకు అదోలా అయిపోయి కుంచించుకు పోయేడు. తన జుట్టు చూసి తనకే ముద్దేసింది. మరో కొద్దిరోజులు పోతే దువ్వేనకూడా దూరలేనన్ని వుంగరాలు...పాతాళభైరవి ఎన్టీవోడిలా. ఆ తలంపే యెంతో ఆనందాన్నిచ్చింది. మూరెడు పొడవున్న యిత్తడి గ్లాసులో బిందెడు కాఫీ చల్లారిపోయింది అప్పటికే!

"అయినా యిదేం పోయేకాలంరా! పొద్దస్తమానం అద్దం పట్టుకొని వదలవేం?! శాస్త్రిగారింటికి పోయి కరివేపాకు పట్టుకురారా అంటే అలా సూడిగేదలా వులక్కుండా పలక్కుండా వుంటావేం?: ముందు కదులు—" అన్న బామ్మ మాటలకి అద్దాన్ని వదలక తప్పలేదు వెంకుకి.

ఆఖరుసారి మళ్ళీ చూసుకున్నాడు.

"కావమ్మగోరు, కావమ్మగోరు—" అన్న కేక ఆ యింటిలో ప్రతిధ్వనించింది. వెంకుకి గుండె ఆగింది. వయ్యారంగా కదులుతున్న జుట్టు నిక్కబొడుచుకొని చూరుకేసి చూస్తోంది.

అలాంటి పిలుపు వినిపించి అప్పటికి నాలుగు నెలలైంది. అతని గుండెలో గునపం గుచ్చుకొన్నట్లయింది. యేదో అనుమానం మెదణ్ని చుట్టేసింది. వణికిపోయేడు. పడబోయే అడుగు పడలేదు. ధైర్యం కూడదెచ్చుకొని బయటకొచ్చేడు.

వరండాలో కావమ్మగారు శివసాయిధ్యం పొందినట్లు మఠం వేసుకొని, కళ్ళు మూసుకొని వింటున్నారు.

"అది అమ్మగోరు. . .పిచ్చిముండ మా సక్కగా వుండేదండి. నెత్తిమీద అరచేయి ఎడల్పున తెల్లటి మచ్చ—కుడికాలుమీద కూడా అలాగే వుంటుంది. సక్కగా డిల్లీ గేదెనాగ కలకల లాడుతుంటది. ఒక్క చెనం నా గొంతుక యినబడకపోతే అల్లల్లాడి పోయేది. మరెకెల్లి పోనాదో! ఏటో! మరీ పూట గడ్డేనా గతికిందో నేదో! కావమ్మగోరు తమరుగోరే రచ్చించాలి. ఆ పిచ్చితల్లి ఎకెల్లి పోనాదో తమరే సెప్పాల...నేకపోతే దాన్తోపాటు నాను కూడ్నేక యిలాగే సచ్చిపోతా!?!"—వచ్చిన ముగ్గుర్లో మధ్యవక్తి తనకి జరిగిన దారుణం గురించి వివరించేడు. కావమ్మగారిలో చలనం లేదు.

ఎదురుగా వున్న ముగ్గురు ప్రాణం వున్నా పోయినట్లు చూస్తున్నారు. ఆమె నోటినుంచి రాబోయే మాటకోసం ఆతృతగా వున్నారు. గుమ్మంలో వున్న వెంకుకి పూనకం వచ్చేలా వుంది. అతని కళ్ళముందు రకరకాల క్రాఫ్‌లు గిర్రున తిరిగేయి. నల్లగా వత్తయిన జుట్టు గాల్లో కదుల్తూ కన్పించింది. మధ్య మధ్య నూనెకి మెరుస్తున్న తెల్లని గుండు అక్కడక్కడ మచ్చల్తో...!! కళ్ళవెంట కన్నీరు జల జలా రాలిపోతున్నాయి. అప్రయత్నంగా చెయ్యి నెత్తిమీద కెళ్ళింది. మెత్తటి జుట్టులో మునివేళ్ళు దూరేసరికి స్వర్గంలో కాలు పెట్టినట్టు పరిక్ష రాయకుండానే టెన్త్ క్లాసు పాసైనట్లనిపించింది. ఆ ఆనందం క్షణికం.

కావమ్మగారు మౌనం విడనాడేరు.

"సుబ్బయ్యా! నీకేం భయంలేదు. నీ గేదె తూర్పుదిశవైపు వెళ్ళింది. భగవంతుడి దయ వల్ల తిరిగొస్తుంది—" అని చెప్పి పూజ గదిలోకి వెళ్ళేసరికి గుమ్మంలో వున్న వెంకు కన్నీటిని ఆపుకోలేకపోయేడు. విసురుగా తను గూడా పూజగదిలోకి పరుగెట్టేడు.

"స్వామీ! ఆ గేదెను క్షేమంగా వారికి

చక్కించు. ఆ గేదె తిరిగొచ్చిన వుత్తరక్షణం నా మనవడి నీ. . ."

"బామ్మా!—" అన్న కేకకి కావమ్మగారి ముసలి గుండె క్షణం ఆగి మళ్ళీ కొట్టుకోబోయింది.

"బామ్మా! నువ్వు మొక్కుకే. ఈసారి నా జుట్టు దేవుడికిస్తే నే చస్తా!! ఈ ఒక్క సారేనా నా మాట వినే. పాడు గేదె పోతే మాత్రం ఏం?! యెంతో జాగ్రత్తగా పెంచుకొంటున్న జుట్టు చూడు! ఎంత బాగుందో!! నువ్వు చెప్పినట్టు గేదె తిరిగొస్తుందే బామ్మా. మొక్కుకోకే!!. . ."

"తప్పు నాయనా అలా అనకూడదు. దేవుణ్ణి కాదంటే కళ్ళు పోతాయి. ఈ జుట్టు పోతే మళ్ళీ వస్తుంది."

"బామ్మా! ఈసారి మొక్కావంటే నేను యింటినుంచి పోతా!"

"నా మాట విన్రా! ఈ ఒక్కసారి యిలా కానీయ్. ఆ తర్వాత నీ యిష్టం. ప్రభూ! నా మనవడి నీలాలు సమర్పించుకొంటాను."

"బామ్మా!!" గాండ్రించేడు.

"ఇంక నా వల్ల కాదు. మాటిచ్చిం. తర్వాత వెనక్కి తీసుకోలేను."

"నేను చచ్చినా నా జుట్టు తీయించుకోను. . . ."

"తప్పు. చెంపలేసుకో! అలా అనకూడదు! ఈ తప్పు క్షమించమని. . ."

"బామ్మోయ్!!—" అని అవాక్కయిపోయాడు.

గోడమీదవేలాడుతున్న దేవుడు దెయ్యంలా కనబడ్డాడు. ఉక్రోషం పెరిగిపోయింది. మూతి యెన్ని వంకర్లు తిరిగిందో అతనికే తెలీలేదు. కసిగా కాల్తో తలుపు తన్నేడు. ధడేల్‌మంది. కావమ్మగారు మాత్రం యోగసమాధిలోకి వెళ్ళిపోయేరు.

శపథం చేసిన వీరపుత్రుడిలా దూసుకొచ్చేడు.

బయట భయభక్తులతో వున్న ముగ్గురు భూమిలోంచి సడన్‌గా బయటకొచ్చిన చెట్లల్లా దిగులుగా చూస్తున్నారు.

చొక్కాతో మొహం తుడుచుకుంటూ కొరకొరా ముగ్గురికేసి చూసేడు వెంకు. లెక్కలు మేష్టార్ని చూసినంత అసహ్యం వేసింది. దూరంగా పోయి రాయి తీసి విసిరికొట్టేడు కసిగా. అతని దురదృష్టం అది ఇంటి పెంకుల మీద పడింది.

ఉక్రోషం పట్టలేక నిప్పుతొక్కిన కోతిలా పరుగు లంకించుకొన్నాడు గుండు వెంకు.

ర ర ర

చింతాక్రాంతుడై వికలిత మనసుతో— చెదిరిన క్రాఫ్‌తో కాలుతున్న కడుపుతో నీరసంగా పొలంగట్టుమీద కూర్చున్న వెంకుకి చచ్చిపోవాల్న కోర్కె మొట్టమొదటిసారి కలిగింది. తన కింక జుట్టు వుండే యోగం లేదు. అలా వుండాలంటే ఒకటే మార్గం....బామ్మ చచ్చిపోవాలి! ఎస్టీవోడు వరిచేలో నుల్చొని జుట్టు సద్దుకొంటున్నాడు—ఆకాశంలో నీలిమేఘశ్యాముడు కిరీటం నెమలి ఈక లేకుండా భుజాలదాగా జుట్టు వేలాడేసుకొని కళ్ళముందు మెదిలేడు. ఏడుపుతోపాటు వెక్కిళ్ళు కూడా వచ్చేయి వెంకుకి.

చిరుచీకట్లు పడబోతున్నాయి.

పడమర సూర్యుడు వెంకు బాధను చూడలేక భూమిలోకి దిగబడిపోయేడు.

మరోసారి నుదుటిమీదకి వచ్చిన జుట్టును స్పృశించి ఘొల్లుమన్నాడు.

సరిగ్గా అదే సమయం అతని కన్నీటిపొరల తెరల మాటునుంచి తన దృష్టి పచ్చటి వరిచేల మధ్య దొర్లుకుంటూ వస్తున్న నల్లరాయిలాంటి గేదెమీద పడింది. గబుక్కున లేచి నుల్చొన్నాడు. రెండు కొమ్ముల మధ్య తెల్లటి మచ్చ....వెంకుకి కోపం, ఆనందం ఒకేసారి కల్గేయి. గబ గబా గేద దగ్గరకు పరిగెట్టేడు.

అదే మచ్చ! అదే గేదె!!....ఖచ్చితంగా సుబ్బయ్య గేదే అది. తోక దగ్గర కుడికాలు మీద కూడా తెల్లటి మచ్చ!

....వెకిలిగా నవ్వుతూ కత్తికి పదునుపెడ్తూ అప్పన్న!

—చెంబుతో నీళ్ళు పట్టుకొని వరాలు పొందిన భక్తురాల్లా కావమ్మ....






అప్పన్న కసిగా నరికేస్తున్నాడు జుట్టును. నేలమీద పడివున్న జుట్టును చూస్తూ చిరునవ్వు చిందిస్తూ కావమ్మ.

మరో పదినిమిషాల్లో ఆ గేదె వూళ్ళోకి వస్తుంది! తన వుంగరాల జుట్టు ముక్కలు ముక్కలుగా మారిపోతుంది. తన ముద్దుల జుట్టు—ఠీవిగా ఆకాశంవైపు చూడని రింగుల జుట్టు....అమ్మో! వొద్దు. నల్లని, మెత్తని క్రాఫ్ కర్కశంగా కత్తెర మధ్య నలిగిపోతోంది.

మెరుపులా వెంకుకి ఆలోచన మెరిసింది.

గట్టుపక్కన కాలవలో బురద తీసుకొని మచ్చమీద పూసేడు. సంతృప్తిగా వూపిరి పీల్చుకొన్నాడు. మచ్చ కనబడటంలేదు. ఇంక ఆ గేదెను ఎవ్వరూ పోల్చుకోలేరు.

చేతికి దొరికిన పుల్లతో అదిలించి నడకసారించేడు.

మెల్లగా చీకటి వూరిమీద వాలిపోయింది.

వెంకుకి కాళ్ళు పీకుతున్నాయి. అడుగు పడటంలేదు. పట్టుదల వెన్ను చరిచింది.చీకట్లో యెటు వెళ్తున్నాడో తనకే తెలీటంలేదు. చుట్టుపక్కల యెక్కడా వూరు జాడ కనిపించటం లేదు. పాడు గేదె గబగబా నడవదు!! వొళ్ళు మండి రాళ్ళతో కొట్టేడు. నీరసం వచ్చింది. ఒక్కసారి బామ్మ గుర్తొచ్చేసరికి మళ్ళీ ఓపిక కూడదెచ్చుకొన్నాడు. తనకి వుంగరాల జుట్టు కావాలంటే ఆ గేదెను తిరిగి రాలేనంత దూరం తోలుకుపోయి వదిలెయ్యాలి. అప్పుడు దాని కూడా దారి తెలీదుగా?!!

నిగనిగ లాడే జుట్టు....సదాశివంగాడికన్నా నల్లగా పొడుగ్గా, చక్కగా కెట్టికొట్లో వేగోడిల్లా వుంగరాలు....యస్టీవోడికన్నా బ్రహ్మాండంగా. కాల్లో ముల్లు దిగేసరికి ఆలోచనల్ని వదిలెయ్యక తప్పలేదు. క్షణం కూర్చుని ముల్లును పీకి కాసేపు విశ్రాంతి తీసుకొని మళ్ళీ బయల్దేరేడు. గతుకుల గట్లమీదనుంచి చేల మధ్య నుంచి గమ్యం లేనివైపు....మధ్య మధ్యలో గడ్డి తింటున్న గేదెను చూడగానే వొళ్ళు మండింది తనకి తిండానికి ఏవీ లేనందుకు.

చాలా దూరంగా మిణుకు మిణుకుమంటూ కనిపిస్తున్నాయి దీపాల కాంతి. బహుశా ఏదో వూరై యుండొచ్చు. ప్రాణం తిరిగొచ్చింది వెంకుకి. అప్పటికి యెన్ని గంటలనుంచి అలా నడుస్తున్నాడో తల్చుకోగానే ఆశ్చర్య కలిగింది నీరసంతోపాటు. ఈ బాధల్ని ఓపిగ్గా భరిస్తే తనకి జుట్టు వుండడం ఖాయం.

కనిపిస్తున్న దీపాల కాంతిని కొండ

గుర్తులా పెట్టుకొని ఆ దారివైపు గేదెను తోలుకుంటూ బయల్దేరేడు గుండు వెంకు.

## 3

గుమ్మంలో నీరసంగా అడుగుపెట్టిన వెంకుకి గుండాగిపోయింది. దాని క్కారణం తను తెల్లవారు తోలుకెళ్ళి దూరంగా ఏదో వూర్లో వొదిలేసిన గేదె తిరిగి కళ్ళముందు ప్రత్యక్షం కాలేదు. కానీ కావమ్మగారు వీధరుగుమీద శోక సముద్రంలో మునిగిపోయి కొంగుతో ముక్కు తుడుచుకొని అలిసిపోయి ఏడ్చే ఓపిక లేనట్లు చూస్తున్నారు. అరుగుకింద దూరంగా మోకాళ్ల మీద తల పెట్టుకొని పక్కింటి శవం దగ్గర పరామర్శకుడిలా మంగలి అప్పన్న-గుండెలో రాయి పడింది.

ఆకలికి అలసటకి మనిషి సగం అయిపోయేడు వెంకు.

వెంకును చూడగానే బావురుమంది బామ్మగారు.

"పిచ్చి నాయనా! ఎక్కడికి పోయేవురా!? నిన్న ప్రొద్దుటి నుంచి కనబడకపోతే నా ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని నీకోసం చూస్తున్నాను. బంగారు కొండే! అంతే చాలు నువ్వు క్షేమంగా వచ్చేవు——" గట్టిగా కౌగలించుకొని భోరుమని కడవలకొద్దీ కన్నీరు కార్చింది.

వెంకులో చలనం లేదు. కోపం తగ్గలేదు. అరుగు మీద మాటా పలుకూ లేకుండా పడ్డాడు.

"మా అమ్మ చచ్చిపోనూ నిన్నటి నుంచి ఎంగిలి పడ్డావురా?!! నే చచ్చిపోనూ ఎంతలా అయిపోయేవురా నాయనా!?"

ఆవిడన్న ప్రతి మాటకు రియాక్షన్ యిస్తున్నాడు అప్పన్న. ఆవిడతోపాటు వాడికూడా దుఃఖం వరదైపోయింది. కానీ దృష్టి మాత్రం నల్లటి వెంకు జుట్టుమీదే.

"ఒరే అప్పన్నా! నిజంగా వాడు వున్నాడ్రా! వాణ్ని నమ్ముకొంటే ఎవ్వరూ అన్యాయం అయిపోరు. నిన్నంతా వీడు కనబడకపోతే మొక్కుకున్నా."

"బామ్మా! ఏవనే!!" భయంగా అన్నాడు వెంకు.

"అదేమిట్రా ఏవనేమిటి! తప్పు లెంపలేసుకో! నువ్వు కన్పిస్తే నీ తల నీలాలు...."

"బామ్మా!!——"అని హతాశుడై వెల్లికితలా పడిపోయేడు. కావమ్మగారు రాగిచెంబుతో నీళ్ల చల్లేరు. కదలికలేదు. విసనకర్రతో విసురుతున్నాడు అప్పన్న. కావమ్మగారికి యేం చెయ్యాలో పాలుపోలేదు. హడావిడిగా ఆతృతగా పూజ గదిలోకి పరిగెట్టింది.

వెంకుకి వంటిమీద స్పర్శలేదు. కదల్లేని శవంలా పడున్నాడు. జుట్టు నిమురుతూ విసురుతున్నాడు అప్పన్న——ఉన్నట్టుండి మధ్య మధ్యలో వెంకు ఛాతీ ఎగిరెగిరిపడుతోంది.

గోడ మీద ఏడుకొండలవాడు నామాల చాటునుంచి కావమ్మగార్ని తదేకంగా చూస్తున్నాడు.

ఆఖరి సీన్లో హీరోయిన్లా దేవుడ్ని తిడుతూ పద్యాలు పాడటంలేదు కావమ్మగారు ——పటం తల్లక్రిందులవ్వలేదు —— అక్కడున్న దీపం ఆరబోయి వెలగటం లేదు——భయంకరంగా వయోలిన్ శబ్దాలు, రేకుల శబ్దాలు వినబడటం లేదు.

కావమ్మ సంపూర్ణ విశ్వాసంతో, అచంచలమైన భక్తితో భగవంతుడ్ని వేడుకుంటోంది మనవడ్ని కాపాడమని.

అరుగుమీద వెంకు కళ్ళు తెరచి ఈ పాప పంకిలమైన జగత్తును చూట్టం యిష్టం లేనట్లు కళ్ళు తెరవకుండా పడున్నాడు.

గ గ గ

చీకటి చీలి తూర్పున ఉదయించిన ఉదయ రేఖలు విప్రుల్లపల్లి మీద పరచుకొన్నాయి. ఊళ్ళో కోళ్ళు జాతీయగీతం పాడినట్లు యిష్టం వచ్చినట్లు అరుస్తున్నాయి. పల్లె కావడంతో వూరంతా అప్పటికే హడావిగా వుంది.

కావమ్మగారు అప్పటికే చెరువులో మునిగి తడిగుడ్డల్తో భగవన్నామ. స్మరణలో మునిగిపోయింది.

వీధరుగుమీద నులక మంచంలో వెంకు వొళ్ళు తెలీకుండా నిద్రపోతున్నాడు.

"కావమ్మగోరూ, కావమ్మగోరూ!"



పూజగదిలో ప్రార్ధనలో పారవశ్యం చెందుతున్న కావమ్మగారికి పిలుపు చెవిలో వినబడే సరికి సుప్రభాతాన్ని అర్ధంతరంగా ఆపి బయట కొచ్చేరు.

"ఏం సుబ్బయ్యా! ప్రొద్దుటే వచ్చేవు. నీ గోల...."

"అదే ఆమ్మగారు మీరు చెప్పింది జరక్కుండా పోతుందా?! మీరు చెప్పినట్టు అది తూర్పునే ఎల్లిందండి. అలాగె ఎల్లి బగమంతుడి దయవల్ల మా బామర్ది వూరు సేరిపోనాదండి. సిత్రం సూడండి. మా బామర్ది కొట్టం లోనే మేత్తోందటండి. ఆడు మానావు ఆచ్చెర్యపోయి ఇదేటి!? ఈ తెల్ల మచ్చల నల్లగేదె ఈ చోటకు మొత్తంమీద మా బావకే గదా వుందని తోలుకొచ్చేసాడండి."

"నే చెప్పలేదూ స్వామి దయ కలగాలే కాని ఇవన్నీ ఓ లెక్కా!"

"అవునమ్మగారు. నేకపోతే మూడూర్లవతల మా బామర్దిదగ్గరకే పోయిందంటే నిజంగా పైన ఆయన సల్లని సూపేనమ్మా! కావమ్మగోరు మీ మేలు ఈ జనమలో మర్సిపోలేను. నా పేణం నాకు దక్కింది. మరి సెల ఇప్పించండి."

"ఎంత మాట నాయనా! నాదేముంది? వాడి దయ" మరోసారి దణ్ణం పెట్టుకొని శెలవిచ్చేసు కొన్నారు కావమ్మగారు.

అవిడ ఆనందానికి అవధిలేదు.సంతోషంతో వుక్కిరి బిక్కిరైపోయేరు. ఏం చెయ్యాలో పాలుపోలేదు. గబగబా మంచంలో వెంకుని నిద్ర లేపేరు.

బద్ధకంగా వొళ్లు విరుచుకుంటూ దుప్పటి తొలగించేడు వెంకు.

"నా పిచ్చికొండా! ఇంక నిద్ర ఏమిట్రా?!! ఇది విన్నావా?!"

"ఏది?!!" అన్నట్టు ఆవులించేడు.

కావమ్మగారి దర్శనం చేసుకోడాని కొచ్చిన అప్పన్న నమస్కారబాణం విసిరేడు.

"ఓరే! అప్పన్నా ఇది విన్నావా?!"

"ఏటమ్మగోరు అది?!—" వినయం వుట్టిపడింది.

"ఆదేరా! మన సుబ్బయ్య తెల్లమచ్చల నల్లగేదె లేదూ?"

"ఆఁ ఏమైంది?!—" వెంకుకి ఆదుర్దా.

"ఏపీ కాలేదు. మొన్న పోయింది కదా! అది తిరిగి తిరిగి వాళ్ళ బావమర్ది వూరే చేరిందట. యెంతదృష్టవంతుడో చూడు! క్షేమంగా యిప్పుడే దిగవిడ్చి వెళ్ళేట్ట. ఎంతైనా దాన్ని జాతకం.... సుబ్బయ్య నా మీదుంచిన నమ్మకం...."

"బామ్మా! నువ్వు చెప్పేది....!"

"నిజంరా! ఇప్పుడే తోలుకొచ్చేట్ట వాళ్ళ బావమర్ది."

పరగడుపునే విషం పుచ్చుకొన్నట్లయింది వెంకుకి. కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగేయి. చిందరవందరగా వున్న జుట్టులోకి అప్రయత్నంగా చేయివెళ్ళింది. వున్నట్టుండి "బామ్మా!" అంటూ గట్టిగా అరిచేడు. అర్ధంకాక అయోమయంగా చూసేరు కావమ్మగారు.

మహా సంతోషంగా పెట్టి సర్దుతున్నాడు అప్పన్న.

కావమ్మగారు మెటికలు విరిచి సా నిద్ర లేచొచ్చిన దేవుణ్ని చూసినట్టు ... త్వంతో మునిగిపోయి వెంకుని దగ్గరకు ... కొన్నారు.

వెంకు కళ్ళముందు తెల్లమచ్చల నల్ల గేదె వెకిలిగా ఇకిలిస్తూ కన్పించింది.

—జుట్టు చిక్కు తీసుకుంటూ ఎస్టీవోడు కన్పించేడు.

—మొట్టికాయలు మొట్టేడు సున్నటి గుండుమీద సదాశివం.

గబుక్కున ఇహంలోకి వచ్చేడు. నవ్వుతూ జుట్టును సర్దుతున్న అప్పన్నను—భగవన్నామ స్మరణ చేస్తున్న బామ్మను చూసి మరోసారి గట్టిగా అరిచి మంచంలోకి కూలిపోయేడు గుండు వెంకు. □

## అంకితం

మంచి స్నేహానికి కొండ గుర్తు!
మంచి హాస్యానికి ఐ. యస్. ఐ. గుర్తు.
గురుడు ఆదివిష్ణుకు ఇది చిరు కానుక!

—రచయిత

సీరియల్




ఒక నిర్ణయానికి వచ్చిన మీరా నాలుగు అవుతుండగా లేచి ఇవతలకి వచ్చింది.

మీరా జడ విప్పుకొంటోంటే కాంతమ్మ అంది "పోని ఈ పూట మానేయకూడదూ."

"చెప్పేసి వస్తాను. అక్కడ వుండను" అంది. మొదటే తల్లికి చెప్పడం మీరాకి ఇష్టం